రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# ఆశల పందిరి



మర్పల్లిలో విరబూసిన మామిడి చెట్టు

**ఈఏడాది విరబూసిన మామిడి**

**మర్పల్లి మండలంలో 1100 ఎకరాల్లో తోటలు**

**డిసెంబరు నుంచే పూత ప్రారంభం**

**20 రోజులుగా అనుకూలించిన వాతావరణం**

**పూత నిలిస్తే లాభాల పంటే**

**గత ఏడాది గణనీయంగా తగ్గిన దిగుబడి**

**పిందె దశలోనే నేల రాలే అవకాశం**

**ముందు నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న శాస్త్రవేత్తలు**

**మర్పల్లి, పిబ్రవరి 1 ప్రబాతవార్త :** మామిళ్ల పూసి నాయి.. మారాకు తొడిగినాయి.. సిలకాలు చేరినాయి.. అని అద్భుతమైన గేయం రాశాడు ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న. ఆ గేయానికి దృశ్యం రూపమైనట్లు మర్పల్లి పరిసరాల్లోని మామిడి తోటల్లోని చెట్లకు పూతలు పూశాయి. ఈ ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా విలసిల్లుతున్న మామిడి రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. మర్పల్లి మండలంలో దాదాపు 1100 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. మర్పల్లి, కోయీ, పట్లూరు, బిలికల్, మల్లికార్జునగిరి, తుమ్మలపల్లి, గార్గులపల్లి తదితర గ్రామాల్లో ఎక్కుగా సాగవుతున్నాయి. వీటిలో ప్రధానంగా దస్తూరి, బంగినపల్లి, మల్లిక, కేసర్, ఇమామ్, బేదిశ రకాల సాగుకు స్థానిక రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఈ ఏడాది మామిడి పూతలు మండల వ్యాప్తంగా బాగానే ఉండటంతో రైతులు కొండంత ఆశతో ముందుకు సాగుతున్నారు. ఒక ఏడాది కాస్తే మరొక ఏడాది కాయక పోవడం మామిడి ప్రధాన లక్షణం. గతేడాది మామిడి కాపు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఎక్కువగా ఉండవచ్చని వస్తున్న పూతలను బట్టి రైతులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో డిసెంబరు ద్వితీయార్థం నుంచి తోటల్లో పూత రావడం ప్రారంభమైంది. ప్రస్తుతం దాదాపు 85 శాతం తోటల్లో పూతలు వచ్చాయి. మిగిలిన తోటల్లో కూడా మరో వారం, పది రోజుల్లో పూత వచ్చే అవకాశముందని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని తోటలు తెల్లపూత దశలో ఉండగా.. కొన్ని తోటలు పచ్చిపూత దశలో ఉన్నాయి. గత రెండేళ్లుగా మామిడి తోటలపై ఆదాయం ఏమీ రాకపో వడంతో ఈఏడాదైనా కలిసివస్తుందనే ఆశాభావంతో ఉన్నారు.

**వాతావరణమే కీలకం**

మామిడి డిసెంబరులో పూత రావడం ప్రారంభమై ఫిబ్రవరి మొదటి వారంలో పిందెలు పడతాయి. మామిడి పూత రావడానికి పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతలు రాత్రిపూట అధిక చలి వాతావరణం ఉండాలి. గత 20 రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో పూతలు ఎక్కువగా వస్తున్నాయి. సంక్రాంతి సమయంలో నాలుగు రోజులపాటు పెద్దఎత్తున వ్యాపించిన పొగమంచుకు తోటల్లో పురుగులు ఆశించి పూత దెబ్బతింటుందేమో అని రైతులు ఆందోళన చెందారు. అయితే అలాంటి నష్టం ఏమీ జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. దిగుబడి వచ్చిన తర్వాత మార్కెట్లో ధర కూడా నిలకడగా ఉంటే మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా పూత అధికంగా కనిపించినప్పటికీ పిందె పట్టే సమయంలో తెగుళ్ల బెడద ఉంటుంది. పూత, పిందె దశలోనే నేల రాలే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తమై పూత దశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**పూత విధానం ఇలా..**

ఒక పూల కొమ్మలో సుమారు 2 నుంచి 3 వేల పుష్పాలు ఉంటాయి. ఈ పూతను కాపాడుకోకపోతే 99 శాతం రాలిపోతుంది. ఒక పూరెమ్మనుంచి 5 నుంచి 6 పిందెలు కడతాయి. వీటిలో ఒకటి రెండుమ మాత్రమే పిందెలు కడతాయి. మామిడి తోటలో పూత రాలడం సహజం. మగ పుష్పాలు, ఫలదీకరణం చెందని పుష్పాలు రాలిపోతాయి. అధిక ఉష్ణోగ్రత, బూడిద తెగులు, తేనె మంచు పురుగు, నీటి ఎద్దడి, అధిక తేమ, హార్మోన్ల లోపం వల్ల పూత, పిందెలు రాలిపోతాయి.

# యువ తరంగం

## పాలిటిక్స్ వైపు యంగ్ లీడర్స్

### మున్సిపల్ బరిలో 80 శాతం మంది యువత

### 50 శాతం మహిళలకే టిక్కెట్లు



తాండూరులో పోటీ చేస్తున్న యువ అడ్వకేట్ సిరిచందన



వికారాబాద్ చైర్‌పర్సన్ కోసం నామినేషన్ వేసిన అనన్య

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** దశాబ్దాలుగా రాజకీయాల్లో తిష్టవేసిన పాత కాపులకు స్వస్తి పలికే తరుణం ఆసన్నమైంది. స్థానిక సంస్థల్లో పేరుకున్న చెత్త చెదారాన్ని ఏరివే యాలన్న సంకల్పంతో యువత ముందుకు వస్తున్నారు. ముందె న్నడూ లేని విధంగా మున్సిపల్ ఎన్నికల బరిలో యువత ప్రవేశించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అత్యధికంగా యువతీ యువకులే పోటీ చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో 100 వార్డులు ఉండగా 80 శాతం మంది యువ నేతలే బరిలో దిగడం విశేషం. ఈ నాలుగు మున్సి పాలిటీల్లో అన్ని రాజకీయ పార్టీల తరపున 521 నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన తర్వాత 386 మంది పోటీలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అందులో 300 మంది 30 నుంచి 35 ఏళ్ల లోపు వారే ఉండటం గమనార్హం. 40 నుంచి 50 ఏళ్లలోపు వారు 60 మంది వరకూ ఉన్నారు. 60 ఏళ్ల వయసు గల అభ్యర్థులు చాలా తక్కువగా ఉన్నారు. గతంలో ఎన్నడూ యువతకు ప్రాధాన్యత లభించలేదు. ఈసారి చాలా మార్పు కనిపిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడి యువతకు టిక్కెట్లు ఇవ్వడం గమనార్హం. విద్యావంతులైన యువతీయువకులు కూడా కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. బీజేపీలో కూడా ఒకరిద్దరు మినహాయిస్తే యువ అభ్యర్థులు బరిలో దిగారు. జనసేన, ఫార్వార్డ్‌బ్లాక్ తరపున కూడా యువకులే ఉన్నారు. ఇలా ఉండగా 50 శాతం మంది మహిళలకే టిక్కెట్లు దక్కడం విశేషం. వికారాబాద్ చైర్‌పర్సన్ బరిలో దిగిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తనయ అనణ్య చిన్న వయసులోనే రాజకీయ అరంగేట్రం వేశారు. ఆమె 30 ఏళ్లు కూడా మించలేదు. తాండూరులో 24 ఏళ్ల యువ లాయర్ కల్వ సిరిచందన కాంగ్రెస్ తరపున 36వ వార్డు నుంచి బరిలో దిగారు. సమాజంలో మార్పు కోసమే తాము బరిలో దిగామని యువ అభ్యర్థులు అంటున్నారు.



నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

## వికసిత భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

### బిజెపి నేతల హర్షం

**షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2026 దేశాన్ని వికసిత భారత్ దిశగా మరింత వేగంగా ముందుకు నడిపించే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి, రైతు, యువత, మహిళలు, పారిశ్రామిక రంగం అన్నింటికీ సమతుల్య ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ ప్రభుత్వ సంకల్పాన్ని చాటి చెప్పిందన్నారు. ప్రజలపై భారం తగ్గించేలా అవసరమైన మందులు, ఆరోగ్య సేవలకు సంబంధించిన ధరలను తగ్గిం చడం ద్వారా ఆరోగ్య భారత్ లక్ష్యానికి బలమైన అడుగు వేయబడిందని తెలిపారు. ఇది సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే నిర్ణయమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన పారిశ్రామిక రంగం, స్టార్టప్స్‌కు ఊతమిచ్చే విధంగా నిధుల కేటాయింపులు, అలాగే స్కిల్ డెవలప్మెంట్, నూతన సాంకేతిక విద్య, ఉద్యోగావకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా యువతకు భవిష్యత్తు భరోసా కల్పించిందన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక కీలక రంగాల్లో కేంద్రం మద్దతు కొనసాగించడం, మౌలిక వసతులు, రవాణా, పరిశ్రమలు, విద్య రంగాల్లో నిధులు కేటాయించడం రాష్ట్ర పురోగతికి దోహద పడుతుందన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ రాజకీయ లాభాల కోసం కాకుండా, దేశ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన గ్రోత్ బడ్జెట్ అని, వికసిత భారత్-2047 సంకల్పాన్ని సాకారం చేసే దిశగా మరో మైలురాయిగా నిలుస్తుందని శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

# పాదయాత్రలు..ర్యాలీలు

## ఊపందుకుంటున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారం



యాడారంలో పాదయాత్ర చేస్తున్న డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు



లక్ష్మాపూర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి

**శామీర్‌పేట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపాల్టీలోని యాడారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేశారు. ఆదివారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని యాడారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం గ్రామంలో పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని అభివృద్ధి,సంక్షేమం చూసి యాడారంలో కాంగ్రెస్ అభ్యర్థి సుజాతను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ముజీబుద్దీన్, మేడ్చల్ ఎ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షులు తుంకి రమేశ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్,యు.వెంకటేశ్ పాల్గొన్నారు.

**లక్ష్మాపూర్‌లో బిఆర్ఎస్ బహిరంగ సభ**

లక్ష్మాపూర్ గ్రామంలో బిఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి కోరారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్‌లో 3,5వార్డులకు సంబంధించి బిఆర్ఎస్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగ జరిగిన సమావేశంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నాయకులు ఎన్నికలు వస్తే హామీలు ఇస్తారని, అమలు మాత్రం చేయరని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు ఇదే నిదర్శనమన్నారు. లక్ష్మాపూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థులు గౌటె నాగమణి, చిన్నలచ్చ సరితశ్రీనివాస్‌గౌడ్‌లను బిఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్నట్లు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ బిఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి భద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజిగౌడ్, మాజీ ఎంపిటిసి నాగరాజు, మాజీ ఉపసర్పంచు గౌటె నర్సింలు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**ఇంటింటి ప్రచారంలో బిజెపి**

షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త : షాద్ నగర్ పట్టణంలోని ఆరో వార్డు బిజెపి అభ్యర్థి ఎస్. వెంకట్ నాయక్ తరఫున బిజెపి షాద్ నగర్ ఇంచార్జ్ అందే బాబయ్య ప్రచారం చేశారు. బిజెపి అభ్యర్థి వెంకట్ నాయక్ ను అత్యధిక గెలిపించాలని ఈ అభ్యర్థి మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటాడని బాబయ్య అన్నారు.



## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### ఎస్‌పి స్నేహ మెహ్రా

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈనెల 1వ తేది నుంచి 28వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రకటించారు. ప్రజా జీవనానికి ఎటువంటి అటంకం కలగకుండా, అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమె వెల్లడించారు. ఈ చట్టం అమల్లో ఉన్న సమయంలో జిల్లా పరిధిలో పోలీసు అధికారుల మందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు లేదా ప్రజలు గుంపులుగా చేరే కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేదమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగలు లేదా రాజకీయ సభల పేరుతో నిర్వహించే ఏ కార్యక్రమమైనా సరే, నిర్వహకులు కనీసం వారం రోజుల ముందుగా సంభందిత పోలీసు అధికారులకు దరఖాస్తు చేసుకొని లికితపూర్వక అనుమతి పొందాలని సూచించారు. అనుమతి పొందిన వారు కూడా నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించకూడదని, ధ్వని కాలుష్యం కలిగించేలా లౌడ్ స్పీకర్లను పరిమితికి మించి వాడకూడదని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ప్రవర్తించినా, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రహదారులను దిగ్బంధించినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అమె తెలిపారు.ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్)వంటి వాటిలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై పోలీసు నిఘా ఉంటుందని,వారిపైన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా పోస్టులు పెట్టినా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలను షేర్ చేసినా ఐటీ యాక్ట్, 30 పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా ప్రజలందరూ పోలీసు యంత్రాంగానికి సహకరించాలని, చట్టాన్ని గౌరవించి శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఎస్పీ తెలిపారు.

## మానవీయ విలువలకు నిదర్శనం అంబేద్కర్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కుల, మత, లింగ వివక్ష లేకుండా అంబేద్కర్ భారతావని కోసం ఎంత గానో కృషి చేశారని డిఐసిసిఐ కాంట్రాక్టర్స్ వింగ్ హెడ్ పిట్ల బాల్‌రాజ్ కొనియాడారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 251వ వారం నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా డిఐసిసిఐ కాంట్రాక్టర్స్ (హెచ్‌ఎం డబ్ల్యుఎస్ఎస్‌బి) వింగ్ హెడ్ పిట్ల బాల్‌రాజ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

## నేటి నుంచి ఆన్‌లైన్‌లో యూరియా బుకింగ్ కొనుగోళ్లు

**షాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** యూరియా ఫెర్టిలైజర్‌ను సోమవారం నుండి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకునే విధానాన్ని రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు షాబాద్ మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర ఆదివారం తెలిపారు. రైతులు ఇకపై ఎరువుల దుకాణాల వద్ద క్యూల్లో నిలబడాల్సిన అవసరం లేకుండా, తమ ఇంటి వద్ద నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్లో యూరియాను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మండలంలోని అన్ని అధీకృత రిటైలర్లు, పిఎసిఎస్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను రైతులు యాప్ ద్వారా రియల్‌టైమ్‌లో పరిశీలించవచ్చని తెలిపారు. యూరియా సరఫరాను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని వివరించారు. యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు తగిన సూచనలు చేసినట్లు తెలిపారు. రైతులు ముందుగా గూగుల్ ప్లేస్టోర్ లో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని రైతులు లేదా పౌరులు తమ మొబైల్ నంబర్‌ను ఉపయోగించి యూరియా బుకింగ్ యాప్‌లో సులభంగా లాగిన్ కావచ్చు అని,జిల్లాలోని రిటైలర్ల వారీగా అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల ప్రస్తుత స్టాక్‌ను ఎవరైనా తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు.యూరియా బుకింగ్‌కు పట్టా భూ యజమానులు, పట్టాదారులు, నాన్‌పట్టా/ఎన్డీఎస్ రైతులు, కౌలుదారులు మాత్రమే అర్హులని, గుర్తింపు నిర్ధారణ కోసం పిపిబి (పట్టా పాస్‌బుక్)తో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ పంపబడుతుంద అని అన్నారు.రిటైలర్లు నివేదించిన రియల్‌టైమ్ స్టాక్ ఆధారంగా రైతులు యూరియా బ్యాగులను బుక్ చేసుకుని, బుకింగ్ పూర్తయిన అనంతరం రైతుకు ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడీ జనరేట్ అవుతుందన్నారు. సాగు ట్యాబ్‌లో నమోదు చేసిన భూమి విస్తీర్ణం ఆధారంగానే యూరియా బ్యాగుల సంఖ్య స్వయంచాలకంగా నిర్ణయించబడుతుందని తెలిపారు. పంపిణీని సమర్ధవంతంగా నిర్వహించేందుకు బుకింగ్‌లు నిర్దిష్ట విరామాల్లో బహుళ విడతలుగా (స్ప్లిట్స్) విభజించబడినట్లు వివరించారు.

## మురికి కూపాలు



పృథ్వీ కాలనీలో రహదారుల దుస్థితి

**నందిగామ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** నందిగామ మండలం అంతి రెడ్డి గూడ పంచాయతీ పరిధిలో ఉన్న పృథ్వీ కాలనీలో రహదారులు మురికికూపంలా తయారయ్యాయి. ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉండిపోతుండటంతో ఈగలకు, దోమలకు నివాసమైంది. పాదచారులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. ఏ సమస్య ఉన్నా తక్షణం స్పందిస్తామంటూ ఎన్నికలలో హామీలు గుప్పించిన ప్రజాప్రపతినిధులు స్పందించి అండర్ డ్రైనేజీ మరమ్మతులకు కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## భగ్గుమన్న బిఆర్ఎస్

### కెసిఆర్‌కు సిట్ నోటీసులపై నిరసనలు

### రేవంత్ దిష్టిబొమ్మలు దహనం

### పలు చోట్ల ఉద్రిక్తత



సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కెసిఆర్‌పై సిట్ విచారణను నిరసిస్తూ ఆదివారం రంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల బిఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తంచేశారు. పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో సిఎం రేవంత్ దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. కెసిఆర్‌పై కక్ష సాధింపు చర్యలు తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డి గూడ గ్రామం వద్ద షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సింది పోయి ప్రతిపక్షాలను టార్గెట్ చేసి డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని ఆగ్రహం



శామీర్‌పేటలో మాజీ సిఎం కెసిఆర్ కాన్వాయ్‌పై పూల వర్షం కురిపిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

## కెసిఆర్‌కు ఘన స్వాగతం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** సిట్ విచారణ కోసం ఎర్రవల్లి ఫామ్‌హౌజ్ నుంచి శామీర్‌పేట (మండల కార్యాలయం) రాజీవ్‌రహదారి మీదుగా నగరంలోని నందినగర్‌కు కాన్వాయ్‌గా వెళుతుండగ శామీర్‌పేటలో బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు బిఆర్ఎస్ శ్రేణులు రోడ్డు పక్కన నిలబడి ఘనంగా స్వాగతం పలుకుతూ కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు.

## వికసిత భారత్-2047 లక్ష్యానికి దారిదీపం

**కేంద్ర బడ్జెట్‌పై బొక్క నర్సింహారెడ్డి**

**రంగారెడ్డి ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 01,ప్రభాత వార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ దేశాన్ని వికసిత భారత్–2047 లక్ష్యానికి తీసుకెళ్లే స్పష్టమైన దారిదీపమని మెదక్ జిల్లా ఇన్‌చార్జి బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు.ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టి గల నాయకత్వంలో రూపొందిన ఈ బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధి, ఉపాధి సృష్టి, మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే మూడు కీలక అంశాలను కేంద్రంగా పెట్టి దేశ భవిష్యత్తును రూపకల్పన చేసినట్లు తెలిపారు.ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగానికి, ముఖ్యంగా రైల్వేలు, జాతీయ రహదారులు, పరిశ్రమలు, లాజిస్టిక్స్ అభివృద్ధికి పెద్దపీట వేయడం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడి కోట్లాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. తయారీ రంగం, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు బీజేపీ ప్రభుత్వం నిరంతరం మద్దతుగా నిలుస్తోందనడానికి ఈ బడ్జెట్ స్పష్టమైన నిదర్శనమని అన్నారు.

సామాన్య మధ్యతరగతి ప్రజలపై అదనపు పన్ను భారాన్ని మోపకుండా ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించడం బీజేపీ ప్రభుత్వ ప్రజాకేంద్రిత పాలనకు నిదర్శనమని తెలిపారు. ఫిస్కల్ డెఫిసిట్‌ను నియంత్రిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించడంలో బీజేపీ ప్రభుత్వ నిబద్ధత ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

విద్య, మహిళా సంక్షేమం, సామాజిక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా "సబ్కా సాథ్ – సబ్కా వికాస్ – సబ్కా విశ్వాస్" అనే బీజేపీ ప్రభుత్వ మౌలిక సిద్ధాంతాన్ని ఈ బడ్జెట్ మరింత బలంగా ప్రతిబింబిస్తోందని తెలిపారు.

మొత్తంగా ఈ బడ్జెట్ తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలమైన శక్తిగా నిలబెట్టే దీర్ఘకాలిక విజన్‌తో రూపొందిన బడ్జెట్ అని బొక్క నర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు.

## పేదలకు అందని ద్రాక్షలా కేంద్ర బడ్జెట్: కె.ఎల్.ఆర్

**రంగారెడ్డి ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి 01,ప్రభాత వార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ పేదలకు అందని ద్రాక్షలా మారిందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కె.ఎల్.ఆర్) తీవ్రంగా విమర్శించారు.రోజువారీ చిన్న ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మధ్యతరగతి వేతన జీవులు ఆదాయపన్నుపై భారీ ఊరట లభిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అయితే అవన్నీ అడియాశలుగానే మిగిలిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఐటీ రిటర్న్‌లలో మార్పులు చేస్తారని వేతన జీవులు ఆశించారని తెలిపారు.మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి వీబీ జీ రామ్ జీకి భారీ నిధులు కేటాయిస్తారని భావించామని, కనీసం పేదల రోజువారీ కూలీని కూడా పెంచలేదని కె.ఎల్.ఆర్ మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రాలపై పెనుభారం మోపుతోందని విమర్శించారు.కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా హైటెక్ బడ్జెట్ తప్ప పేదల సంక్షేమానికి సరైన కేటాయింపులు లేవని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవసరాలకు ఈ బడ్జెట్‌లో పూర్తిగా అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.తెలంగాణకు అవసరమైన కొత్త రైల్వే లైన్లు, కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయాల అభివృద్ధి, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రో కారిడార్ విస్తరణ, నిరుద్యోగ నిర్మూలనకు ఉద్యోగ–ఉపాధి మార్గాలు, కొత్త జాతీయ రహదారుల కోసం ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం ద్వారా కేంద్రం వివక్ష చూపిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

యువత, మహిళల సంక్షేమం, సంస్కరణలను ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లక్ష్మారెడ్డి ఆరోపించారు. తెలుగింటి ఆడపడుచు తొమ్మిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్ప పేదలు, మధ్యతరగతి, రైతులు, మహిళలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. పెరిగిన ధరలను నియంత్రించే దిశగా కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టమైన చర్యలు లేవని ఆయన విమర్శించారు.




## కొందుర్గు మండల కేంద్రంలో రాస్తా రోకో

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం..**

**కొందుర్గు ,ఫిబ్రవరి 01,ప్రభాత వార్త:** కొందుర్గు మండలము లోని అన్ని గ్రామాలలో ,కొందుర్గు మండల కేంద్రం లో కాంగ్రెస్ ప్రభుత్వానికి, వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ మిసర కార్యక్రమాలు చేపట్టడం జరిగింది, మండల ,కొందుర్గులో రాస్తారోకోలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేయడం జరిగింది, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తూ ప్రభుత్వానికి సిఎంకి మంచి బుద్ధిని ప్రసాదిస్తూ, హామీలను నెరవేర్చుమని వేడు కోవడం జరిగింది.

పాల్గొన్న వారిలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజి వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులు రామ కృష్ణ, నరసింహులు, జగదీశ్వర్ గౌడ్, సున్నాల శ్రీనివాస్, చంద్ర శేఖర్, అబ్దుల్ కలాం, ఆకుల మానయ్య , వాసురీ సర్పంచులు పత్తి శ్రీశైలం, సుందు శ్రీలత రాములు, రవీందర్ రెడ్డి, గోపాల్ నాయక్, గుడిసె సచిన్, లక్ష్మణ్ నాయక్, కుమ్మరి బాలరాజు, నర్సింగ గౌడ్, కృష్ణ, బి యాదయ్య, కృష్ణయ్య, బాలాంజన్, జి గణేష్, నరసింహులు, బి. బాలరాజు ఎద్దు కృష్ణయ్య, రవీందర్ గౌడ్, యాదయ్య, వహీద్, నాగేష్, రాజు, మండల గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నవీన్ కుమార్‌కు సత్కారం

**షాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్ ను తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు రాపోలు నర్సింలు తదితర నాయకులతో ఆదివారం మర్యాదపూర్వకంగా నగరంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు శ్రీ చైతన్య హై స్కూల్ నాగర్ గూడ కరస్పాండెంట్ సిద్దాపురం ప్రసాద్, డైరెక్టర్ సుశాంత్ కుమార్, మాంటిసోరి ప్రిన్సిపాల్ సుధాకర్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

## ఘనంగా తూంకుంట శ్రీమల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం



తూంకుంటలోని శ్రీమల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం సందర్భంగ దర్శించుకున్న మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్,పాల్గొన్న పలువురు నాయకులు,భక్తుల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్ పరిధిలోని తూంకుంట గ్రామంలో శ్రీమల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్‌లోని తూంకుంట గ్రామంలో శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో శ్రీ మల్లిఖార్జునస్వామి (మల్లన్న) కల్యాణోత్సవం ఘనంగా కన్నుల పండుగా జరిగింది. గొల్ల కేతమ్మ,బలిజ మేడలమ్మ సమేత మల్లిఖార్జునస్వామిల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆ తరువాత ఆలయం ప్రాంగణంలో అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి శ్రీస్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగ శ్రీస్వామి వారిని భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకున్న వారిలో మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్,నాయకులు ఎల్.బాల్‌రాజ్‌గౌడ్, బి.పరమేశ్‌యాదవ్, టిఆర్ రవీందర్‌గౌడ్, టి.నాగన్నయాదవ్, పి.మహేశ్‌యాదవ్, ఎం.మల్లేశ్‌యాదవ్, పి.నాగేశ్‌యాదవ్, బి.సదానంద్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ పలువురు యాదవ సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**..ఉద్దెమర్రిలో శ్రీమల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం**
**..నేడు జాతర, అగ్నిగుండాలు,బోనాల ఊరేగింపు**

ఉద్దెమర్రి గ్రామంలో శ్రీమల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఉద్దెమర్రి గ్రామంలో శ్రీభ్రమరాంభిక మల్లిఖార్జునస్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు పాల్గొని శ్రీస్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఇక సోమవారం జాతర సందర్భంగా అగ్నిగుండాలు, బండ్లు,బోనాల ఊరేగింపు కార్యక్రమాలు జరుగనున్నట్లు ఉద్దెమర్రి ఆలయ దేవస్థాన కమిటీ వారు పేర్కొన్నారు. శ్రీభ్రమరాంభ మల్లిఖార్జునస్వామి ఆలయం ప్రాంగణంలోనే ఉన్న దత్తాత్రేయ దేవాలయం, ఇంగ్‌లాజ్ భవాని దేవాలయాలు ఉండి భక్తులను ఆకర్షింపజేస్తున్నాయి. జాతర సోమవారం జరుగుతున్నందున భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని శ్రీస్వామి వారిని, అదే విధంగా ఇంగ్‌లాజ్ భవాని మాతను, దత్తాత్రేయను భక్తులు దర్శించుకోనున్నారు.

## శివ నామ స్మరణతో మారుమ్రోగిన కొందుర్గు



**కొందుర్గు ,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:** హోం నమో శివాయ అనే నామ స్మరణతో మండల కేంద్రము మారుమ్రోగింది. ఆదివారంనాడు మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ప్రాంగణములో గురు స్వామి కమ్మరి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరింగింది. ముందుగా అక్కడే ఏర్పాటు చేసిన శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా స్వాములు పాడినిపాటలు, చేసిన భజన పాటలతో తోపాటు. శివనాస్నరణలతో మండలకేంద్రము మారుమ్రోగింది.. ఈ మహపడిపూజకు నవాబుపేటు పార్కునగర్, జిల్లేడు. చౌదరిగూడెం, పూడూరు, మండలాల నుండి సుమారు 500 మంది శివ స్వామూలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ లో గురుస్వాములు ఈసారి సత్యము, చిలం లింగం, జగదీశ్వర్ గౌడ్, మూడ్సు యాదగిరి,ఈసారి లింగం, ఆలయ అర్చకులు జంగం భరత్, జంగం రవి పంతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదాల నివారణకోసం కృషిచేయండి

**చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి**



పూడూరు మండలం అంగడిచిట్టపల్లి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ భరత్‌రెడ్డి,తదితరులు

**పూడూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** రోడ్డుప్రమాదాల నివారణకోసం ప్రతిఒక్కరు కృషిచేయాలని చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం పూడూరు మండ లం పరిధిలోని అంగడిచిట్టపల్లి గ్రామంలో సిసి కెమెరాలు,వాహనదారులకు రోడ్డ ప్రమాదాల నివా రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డుభద్రత నియమాలను తప్పకుండా పాటించాలని,మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని వివరించారు.వాహనాలు నడిపేవారు అన్ని డాక్యుమెంట్లు ఉండేవిధంగా చూసుకోవాలని,మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా శిక్షలకు అర్హులవుతారన్నారు.ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న సైబర్ నేరాలవల్ల కలిగే అనార్థాలగురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచిం చారు.గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదవరెడ్డి, ఉపసర్పంచ్ మమత, ఎంపీడిఓ సత్తయ్య,నాయకులు బందల అంజయ్య ,సత్యనారాయణగౌడ్, ప్రవీణ్,శ్రీశైలం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎకో టూరిజం పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

**...ప్రిన్సిపల్ ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ పారెస్టు సువర్ణ**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, పిబ్రవరి 1, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లాలో చేపడుతున్న ఏకో టూరిజం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ పారెస్టు సువర్ణ అన్నారు. ఆదివారం హెచ్ఓఎఫ్ఎఫ్ సువర్ణ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ ప్రియాంక వర్గీస్, ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ రంజిత్‌కుమార్ నాయక్ వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న ఏకో టూరిజం అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇందులో భాగంగా అనంతగిరి అర్బన్‌పార్కులో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ నగర్ వన్ యోజన పథకం కింద కోడంగల్ రేంజ్‌లో అప్పాయిపల్లి అర్బన్‌పార్కు, పరిగి రేంజ్‌లో జాఫర్‌పల్లి పార్కు తాండూరు రెంజ్‌లో గొట్లపల్లి అంతారం అర్బన్‌పార్కు, వికారాబాద్ రేంజ్‌లో అనంతగిరి అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కేడిఎ నిధులతో కోడంగల్ రేంజ్‌లో బోంరాస్‌పేట్‌లో మరొక అర్బన్ పార్కు పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు.డాక్టర్ ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ వికారాబాద్‌లో ఏకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలుకల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం వికారాబాద్ రేంజ్, మోత్కుపల్లి సెక్షన్, ఎన్కతల గ్రాస్ లాండ్స్‌ను పరిశీలించారు.ప్రైవేటు క్వారీలో పొదిగిన అరుదైన పక్షి జాతికి చెందిన ఇండియన్ రాక్ ఈగిల్ ఔల్(బుబో బెంగాలెన్సిస్)ను గుర్తించిన వైల్డ్‌లైఫ్ ఫ్రోటోగ్రాఫర్ మనోజ్ విట్టెపునుపక్షి పరిరక్షణకు సహకరించి వాటి పిల్లలు ఎగిరే పోయేవరకు క్వారి పనులను ఆపాలని సూచించారు. వాటి సంరక్షణకు సహకరించిన లక్ష్మారెడ్డిని ప్రశంసిస్తు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పి స్నేహ మెహ్రా, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, రేంజ్ ఆఫిసర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రవీణ్ పటేల్ మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే.

## పటేల్ ప్రవీణ్‌కు ఎమ్మెల్యే నివాళులు ..!

**తాండూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** తాండూరుకు చెందిన యువ నేత పటేల్ ప్రవీణ్ మృతదేహానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాళుల్పించారు. రెండు రోజులగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ప్రవీణ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని పటేల్ ప్రవీణ్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కులుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మాజీ యంపిటిసి పటేల్ ప్రవీన్ మృతి బిఆర్ఎస్‌కు తీరనిలోటు

**..మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్**

**పెద్దేముల్, పిబ్రవరి 1, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం ఇందూరు మాజీ యంపిటిసి పటేల్ ప్రవీన్ కుమార్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా కోహీర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలలో చురుకుగా ఉంటు పలువురి మన్ననలు పొందిన వ్యక్తి పటేల్ ప్రవీణ్ అని అన్నారు. కల్మషంలేని మనిషిగా అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్న పటేల్‌ప్రవీన్ లేడంటే నమ్మశక్యం కావడంలేదని అన్నారు. ఆయన మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందూరు గ్రామానికి చెందిన మాజీ యంపిటిసి పటేల్ ప్రవీన్ కుమార్ తన వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యా యత్నానికి పాల్పడటంతో హైద్రాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందారు.



పటేల్ ప్రవీణ్‌కుమార్

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి భాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇందూరు యంపిటిసిగా, తట్టెపల్లి సొసైటి డైరెక్టర్‌గా పనిచేసిన పటేల్ ప్రవీన్ కుమార్ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో స్వల్ప మెజార్టీతో ఓటమిపాలయ్యారు. ఆయన మృతి చెందడం పట్ల ఇందూరు. తాండూరులో విషాదచాయలు అలముకున్నాయి. పటేల్ ప్రవీన్ మృతి పట్ల బిఆర్ఎస్ నాయ కులతో పాటు బిజెపి, కాంగ్రెస్ ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## విద్యుత్ లైన్లకు మరమ్మత్తులు

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 01,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో 33 కేవీ లైన్ల మరమ్మతులు చేపట్టారు.ఎన్నో ఏళ్లగా విద్యుత్ స్తంభాలు మరమ్మత్తులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్న తరుణంలో ఇటీవల జిల్లేడు చౌదరిగుడం ఏఈగా బాధ్యతలు చేపట్టిన నర్సింలు గమనించి ఆదివారం వాటిని సరి చేయించారు. మండలంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నము 01.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేసి పంట పొలాల్లో వారిగిన 33 కేవీ విద్యుత్తు లైన్లో మరమ్మతులను సిబ్బంది, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టి పరిష్కారించారు. పొలాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి 33 కేవీ లైన్లో 4 స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేసి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ నర్సింలు మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు ఎక్కడున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చాలా రోజులుగా పేరుకుపోయిన సమస్యలను విడతల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. తుమ్మలపల్లి వీరన్నపేట జిల్లేడు 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని ప్రజలు సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాషా, ప్రవీణ్ పటేల్, సలీం, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 01,(ప్రభాతవార్త):** గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మని ఆ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు భూమగళ్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లెడ్ చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో సయ్యద్ ఫౌజియా బేగం అజామ్ ఇళ్ల స్లాబు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కన్న తల్లి లాంటిదని అన్నారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామంలో గుడి బడితో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఉంటుదని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని పెర్కోన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద వారి ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో లిగం, శ్రీశైలం, ఫారుక్, సయ్యద్ మథిన్, నర్సిములు, శ్రీను, ప్యాట రాములు,సెంట్రింగ్ గౌస్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు స్లాబు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

## నీటి సమస్య పరిష్కారానికి మరమ్మత్తులు

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 01,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చింతకుంట గ్రామ పంచాయతీలోని వివిధ తండాల్లో మంచినీటి సరఫరా పైపుల లీకేజీలను సరి చేయించినట్లు సర్పంచ్ దేవీ రామ్ చరణ్ ఆదివారం తెలిపారు. ఇదివరకే పంచాయతీ కార్యదర్శి యాదయ్య ఆధ్వర్యంలో పర్యవేక్షి ంచి సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించినట్లు తెలిపారు. వెంటనే వాటికి కావాల్సిన సామాగ్రిని సమకూర్చి సిబ్బందితో సరి చేయించినట్లు తెలిపారు. గ్రామంలో సమస్యలను ఒక్కొక్కటిగా గుర్తించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. చింతకుంట తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవడానికి గ్రామస్తులు సహకరించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.




పైపులైన్ మరమత్తులు చేస్తున్న సిబ్బంది

## నిరుపేద వైద్య ఖర్చులకు భరోసా

**షాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** విష్ణు సేనా సమితి ఆధ్వర్యంలోబాబుల్‌రెడ్డినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న శివకృష్ణకు విష్ణు సేనా సమితి కన్వీనర్ గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన శివకృష్ణ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డికి కనిపించడంతో మానవతా దృక్పథంతో చేరదీసి తక్షణం వైద్యం కోసం పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో విష్ణు సేవా సమితి సభ్యులు రుద్రారం మాజీ సర్పంచ్ బండ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ కొర్రెములలో ఇటీవల మృతిచెందిన బండిరాల మంజుల కుటుంబ సభ్యులను ఎస్‌వైఆర్ పౌండేషన్ ప్రధాన కార్యదర్శి బిఆర్ఎస్ నేత సామల సందీప్ రెడ్డి పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. మృతురాలు కుటుంబ సభ్యులు కడుబీదవారు కావడంతో ఖర్చుల నిమిత్తం నగదు సహాయం అందజేసినట్లు ఎస్‌వైఆర్ పౌండేషన్ ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి తెలిపారు. ఎస్‌వైఆర్ పౌండేషన్ సభ్యులతో పాటు బీఆర్ఎస్ నాయకులు దుర్గారాజు గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



అందజేస్తున్న సందీప్‌రెడ్డి

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టె యత్నాలు

**..మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్**
**..కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవటంతో**
**బిజెపిలో చేరిన కొండ నర్సింగ్‌రావు**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఓటర్లను మభ్యపెట్టి గెలవటానికి యత్నిస్తున్నాయని, ఆ రెండు పార్టీల తీరును మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని బిజెపి కార్యాలయంలో బిజెపిలో చేరిన కొండ నర్సింగ్‌రావుతో పాటు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులతో, మద్యంతో ఓటర్లను మభ్యపెట్టటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. కొల్తూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండ నర్సింగ్‌రావు బిజెపిలో చేరినట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగ బిజెపిలో చేరిన కొండ నర్సింగ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్నానని, అయితే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి భిఫామ్ ఇస్తామని మోసం చేశారని, అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరినట్లు తెలిపారు. తరతరాలుగా కాంగ్రెస్ పార్టీలో మా కుటుంబం వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీజెండా మోశామని, తమకు పార్టీ టికెట్ ఇవ్వకుండ మోసం చేశారని, అవమానించారని దీన్ని నిరసిస్తూ బిజెపిలో చేరినట్లు కొండ నర్సింగ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిపల్లి మున్సిపాల్టీ బిజెపి ఎన్నికల ఇన్‌చార్జి,మేడ్చల్ జిల్లా బిజెపి అర్బన్ సెక్రటరీ గోనె శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు నందాల శ్రీనివాస్, గిరిజనమోర్చ జిల్లా నాయకులు వెంకటేశ్,సుదాకర్, బాలనర్సింహ్మా, బిక్షపతి, రాజు, జంగాలు, వెంకటస్వామి, రమేశ్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.




మూడుచింతలపల్లి మున్సిపాల్టీ బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, బిజెపి ఎన్నికల ఇన్‌చార్జి గోనె శ్రీనివాస్, బిజెపిలో చేరిన కొండ నర్సింగ్‌రావు తదితరుల దృశ్యం